*ఊతకర్ర ఉపయోగం ఊతకర్రకేం తెలుసు? ఉపయోగించే తెలివైనవాడికి తెలుస్తుంది కానీ....!*

# ఊతకర్ర

రాత్రి రెండు గంటలు. ఈదురుగాలి జోరుగా వీస్తోంది. ఆశ్వీజాంతంలో కురిసిన వర్షాలవల్ల చలి ఉధృతంగా వుంది.

తాటాకు పాక పంచలో అపహనంగా నిలబడ్డాడు నారాయుడు! గాలికి కదులాడుతున్న తాటాకుల్లా వాడి మనస్సు కూడా పన్నగా కంపిస్తోంది! ఈదురుగాలి తనలోని చిరాకును రెట్టింపు చేస్తూంటే బీడీమీద బీడీ తగలేస్తున్నాడు.

ఒత్తుగా పరిచిన గడ్డి, గడ్డిమీద గోనెపట్టా, పట్టామీద ప్రసవ వేదన పడుతున్న పారమ్మ. పారమ్మకి ప్రక్కనే కూర్చొని తనకు తెలిసిన ప్రయత్నాలు చేస్తున్న మంగమ్మ- తలుపు తోసి లోనికి చూస్తున్నప్పుడల్లా నారాయుడి గుండెలో రైళ్ళు, కళ్ళలో లీలగా బ్రతుకుభయం.

వెంకమ్మపేట గ్రామంలోని ఒళ్ళొంచి పనిచేసుకోలేని పెద్ద రైతులందరికీ ఒళ్ళు హూనం అయ్యేలా పనిచేసే రామయ్యంటే ఎంతో యిష్టం। పొద్దు పొడవడానికి ముందే పనిలోకి వచ్చి పొద్దు గూకిందాకా ఎముకలు విరిగేలా పనిచేసి యిచ్చినంత కూలిని పుచ్చుకొని పోతాడు కనుక వాళ్ళ కళ్ళన్నీ రామయ్యమీదే వుండేవి। అతన్నే పనికి పిల్చేవారు.

ఇలాంటి రామయ్యకి మిగిలిన ఒకే ఒక్క ఆశాకిరణం నారాయుడు। కొడుకూ, కోడలూ అకాలంగా కాలంచేస్తే శోకాన్ని దిగమింగి మనవడికి తనే సర్వస్వం అయి సాకాడు. బడిలో వేశాడు. ఒక్కొక్క తరగతీ పొద్దెక్కుస్తూ బుద్ధిగా చదువుకుంటున్న నారాయుడ్ని చూసి మురిసిపోయేవాడు। వాడి కేలోటూ కలక్కుండా పెంచడానికి మరింత కష్టించేవాడు రామయ్య.

ఆ రోజు నారాయుడికి బాగా జ్ఞాపకం వుంది. సముద్రంలో తుఫాను లేచిందని బడికి ఆవేళ సెలవిచ్చేశారు। ఇంటికొచ్చేసిన నారాయుడికి పొద్దుపోలేదు. పుస్తకంలోని పద్యాల్ని చూస్తూ పలకమీద వ్రాస్తూ కూర్చున్నాడు. వీధిలో అలికిడైతే తలెత్తి చూశాడు. ఐదారుమంది రామయ్యని మోసుకొస్తూంటే పలకా పుస్తకం అలా వదిలేసి ఆత్రంగా వాకిట్లోకి పరిగెత్తాడు। రామయ్యని తోడుపట్టి యింట్లోకిచేరుస్తున్న వాళ్ళ కాళ్ళకింద పడి నారాయుడి పలక ముక్కలయింది. వాళ్ళ కాళ్ళకున్న బురదలోనలిగి వాడి పుస్తకం ఆకారమే మారిపోయింది।।

రామయ్యకి చూపు పోయిందిట। వర్షాన్ని లెక్కచెయ్యకుండా పొలంలో పనిచేస్తున్నాట్ట। ఓ పెద్ద మెరుపు మెరిసిందట। రామయ్యకి చేరువగా పిడుగు పడిందట. అంతే! కళ్ళు కనబడక పోవడంతో పెద్దగా అరిచి పడిపోయాట్ట। నలుగురూ చేరి స్పృహతప్పిన రామయ్యను వైద్యుడిదగ్గరికి మోసుకుపోతే మందిచ్చి, ప్రాణాపాయంలేదనీ చూపుమాత్రం రాదని ఖచ్చితంగా చెప్పేశాట్ట। అంతా విన్న నారాయుడు భోరున ఏడుస్తుంటే కాసేపు వాడ్ని వూరడించి ఎవరివార్ని వారు పోయారు। బిక్కుబిక్కుమంటూ తాత పక్కనే కూర్చున్నాడు. కొంత సేపటికి తెలివి వచ్చిన రామయ్య మనవడ్ని కళ్ళారా చూసుకోలేని దుస్థితిని గ్రహించి కుమిలికుమిలి ఏడ్చాడు.

రామయ్య స్థితికి వూళ్ళోని పెద్దలంతా బోలెడు సానుభూతి కురిపించారు। 'తిలాదానం తలా పిడికెడు' అన్నట్టు సాయం మాత్రం స్వల్పంగా చేశారు। ఓ వారం గడిచేసరికి సానుభూతిని చూపించిన నోళ్ళే విసుక్కోవడం, కసిరికొట్టడం ఆరంభించాయి। కష్టించి బతికిన ఊళ్ళో ముష్టెత్తుకుబతకడానికి మనస్కరించలేదు. తన ఇంటిని తెగనమ్మి నారాయుడ్ని చేయూతగా చేసుకొని దూరంగా వున్న పట్నానికి వెళ్ళిపోయాడు.

ఓ పదేళ్ళు గడిచాయి। గొంతు మారి, కండపట్టి, యించుమించు తన యెత్తుకి ఎదిగిపోతున్న మనవడ్ని, కడుపు మాడ్చుకుంటూ వెనకేసిన నాలుగు వందల రూపాయల్నీ తడిమిచూస్తూ మురిసిపోయేవాడు రామయ్య।

కనీసం ఆరేడు వందలైనా వెనకేసి మనవడిచేత వ్యాపారం పెట్టించాలనుకున్న రామయ్య ఆశని- ఆరేడు రోజులపాటు కాసిన జ్వరం నిరాశచేసి- అతడ్ని కబళించింది।

తాతయ్య చావుకి కుమిలి కుమిలి ఏడ్చాడు నారాయుడు। ఇన్నేళ్ళ అనుబంధం ఒక్కసారిగా తెగిపోయి ఒంటరివాడు కావడంతో వాడి మనస్సు వికలమైపోయింది। ప్రేమసమాజం వాళ్ళ సహాయంతో తాతయ్య దహనకాండ జరిపించారు। ఆ తతంగం అంతా పూర్తయే

## నిరుద్యోగి పట్టా

నాకంటగట్టిన పట్టా
దాహం తీర్చుకొమ్మని యిచ్చిన
సముద్రం నీళ్ళు;
విశ్వవిద్యాలయపు మసిబూసిన



అక్షరాలతో నలుపు పులమబడిన
గాజుపలక:
ఎదురుగా గ్రహణ సూర్యుడు తప్ప
వేరే వెలుగు కనిపించడం లేదు.

—ఈశ్వరప్రసాద్ జె.

సరికి ఓ వంద ఖర్చయింది!!

పాకలోంచి పారమ్మ గట్టిగా మూలుగుతుంటే స్మృతులకు అంతరాయం కలిగింది. తలుపు తోసి లోపలికి వెళ్ళాడు. భయంకరమైన బాధతో మెలికలు తిరిగిపోతూ కన్నీరు కారుస్తోంది పారమ్మ! బాధ్యత మరిచి నిద్రపోతున్న మంగమ్మని తట్టి లేపాడు.

"లేదు నాయనా తొంగోలేదు. నడుం విలాంగ లాగేస్తుంటే సేరపడ్డానంతే." సంజాయిషీలా చెప్పి సపర్యలు మొదలెట్టింది. ఓ పావుగంట అలా మూలిగి-మూలిగి- దానికున్నా శక్తి చాలక—మగతలోకి జారింది పారమ్మ. మెల్లగా తలుపు చేరవేసి పంచలో కూర్చున్నాడు నారాయుడు.

బీడీ అంటించి కాలుస్తూ గోడకి చేరబడ్డంతో గతం మళ్ళా కదలసాగింది....

తాతపోయి నెల్లాళ్ళు కావొస్తుంటే వాడి మనసు కూడా కాస్త కుదుటపడింది. తన బతుకును గురించి తపన ప్రారంభమయింది! తనేదో వ్యాపకం పెట్టుకోవాలి. తప్పదు సుఖంగా బతకాలి! అలా బతకాలంటే ఏం చెయ్యాలి? ఏ దారి పట్టాలి? అన్నీ ప్రశ్నలే! సమాధానం శూన్యం! అంతా అయోమయంగా వుంది. తన గురించే ఆలోచించుకుంటూ పోతూ అప్రయత్నంగా ఓ సినిమాహాలు దగ్గర ఆగాడా రోజు! అక్కడంతా హడావిడిగా వుంది. ఏదో పిక్చర్ రిలీజయింది. జనం, వాహనాలూ కొంపలంటుకుపోతున్నట్టు అటూ, యిటూ సాగిపోతుంటే అక్కడే అలా నిలబడ్డ నారాయుడి కళ్ళకి రోడ్డుకు అటువేపున ఓ ముసల్ది కనబడింది!

"కళ్ళుగేనిదాన్ని బాబయ్యా! ఎవులేనవొచ్చి రోడ్డు దాటించి పున్నెం కట్టుకోండి తండ్రీ" అంటూ దీనంగా ప్రాధేయపడుతోంది! జనంలో ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదు! ఎవరి తొందర వాళ్ళది! ముసల్ది వూరుకోలేదు. ప్రాధేయపడుతూనే వుంది. నారాయుడు అటు వెళ్ళి దానిచెయ్యి పట్టుకొని "రా!-ఎక్కడకి తీసికెళ్ళాలి?" అని అడిగాడు.

"నానాయిన్నా తండ్రే! అల్లా సినిమాఆలు గేటుకాడ సపటా నాగుంతాదే-అక్కడికి తీసికెళ్ళి కూకోబెట్టీ తండ్రీ!" అంది. పద్మవ్యూహంలాంటి రోడ్డును ప్రయాస పడకుండా దాటించేశాడు! గమ్యంచేరి కూచున్నాక— "రచ్చించినావు తండ్రీ! దేవుఁడ్నిన్ను సల్లగా సూడాల" కృతజ్ఞతనీ, ఆశీస్సుల్నీ కలిపి చెప్పేసి తన ప్రయత్నంలో పడింది ముసల్ది!

"అరిసరిసి గొంతు తడారిపోయింది గావాల....సోడా తాగుతావేటవ్వా?" పథకం ప్రారంభించాడు!

"నా నాయిన్నాయినే....! ఇప్పించు తండ్రీ....!" తెచ్చి యిచ్చాడు. గటగట తాగేసింది. ఖాళీసీసా యిచ్చేసి వస్తూ ఓ పావలా వేరుశనక్కాయలు కొనితెచ్చి "తినవ్వా....!" అంటూ కొన్ని అందించాడు. అవ్వ పొంగిపోతూ తినడానికి వుపక్రమించింది. కబుర్లలో పెట్టి కూపీ లాగాడు. దానికి నిజంగానే యెవ్వరూలేరని తేలడంతో తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. బొక్కిపళ్ళ అవ్వ శనక్కాయల్తో కుస్తీ పడుతుంటే నాలుక్కాయలు వొలిచి పలుకు లందించాడు! "నా నాయిన్నా నాయినే" అంటూ అవ్వ దవడలాడించ సాగింది!



సినిమాకి యింటర్వెల్ యిచ్చారు !!

జనం వస్తున్న అలికిడి వినడంతోనే అలవాటు ప్రకారంగా,

"బాబూ ! గుడ్డివాన్ని తండ్రీ! ధరమం చెయ్యండి మారాజా ...." అంటూ అవ్వ తన రికార్డు మొదలెట్టింది! చిల్లరడబ్బులు అవ్వచేతిలో రాల్తుంటే నారాయుడిలో ఆశలు మోసులెత్తసాగాయి! తిరిగి సినిమా మొదలెట్టడంతో జనం హాల్లోకిపోయారు. వచ్చిన డబ్బుల్ని తడిమింది ! అరవై పైసలు దొరికాయి. భద్రపరిచింది !

"అవ్వా....!"

"ఎవులు .... నారాయుడూ....?!"

"అవునవ్వా నేనే— టీ తాగుతావేటి?

"నా నాయిన్నా నాయినే ! ఇప్పించు తండ్రీ....!" తెచ్చి అందించాడు ! ఊదు కుంటూ గ్లాసు ఖాళీ చేసేసిందవ్వ ! గ్లాసు యిచ్చేసి అవ్వ దగ్గర కూర్చున్నాడు—

"అవ్వా! నువ్వెక్కడుంటున్నావ్ ?"

ఉలిక్కిపడి జోలి గట్టిగా పట్టుకుందవ్వ. అందుక్కారణం ఆర్నెల్ల క్రితం జరిగిన సంఘటన! పగలంతా ఎక్కడో ఓచోట కూర్చుని అడుక్కున్న అవ్వ-రాత్రి వేళలో పడుకోవడానికి కొత్త వలస బడిశాలకు చేరుకుంటుంది. ఆ బడికి తలుపులూ తాళాలూ లేవు మరి! పగలు బడిలాగా, రాత్రుళ్ళు ముష్టివాళ్ళూ కుష్ఠు వాళ్ళూ తల దాచుకునే సత్రంలాగా బహు ళార్థ సాధకంగా అదిపనికివస్తోంది. రోజూ లాగే పాకలో నిద్రపోతున్న అవ్వ మొల లోని జోలిని ఎవడో లాక్కుపోయాడు. వెంటనే తెలివి వచ్చిన అవ్వ అరిచి కేక లేసిందిగానీ అక్కడ తనలాగే తల దాచు కుంటున్న కుంటివాళ్ళూ,కుష్ఠువాళ్ళూ అవ్వ కేవిధంగానూ సాయపడలేకపోయారు! సొమ్ము పోయిన అవ్వకి శోకంమిగిలింది.

'ఒకవేళ ఈ నారాయుడు'కూడా....'

"చెప్పవ్వా? ఎక్కడుంటున్నావ్?"

"ఎ- ఎ- ఏల బాబిరంతా అడుగుతన్నావూ...." అవ్వ అనుమానం తీర్చాలి ముందని నిశ్చయించుకుని తన బతుకును గురించి పూసగుచ్చినట్టు చెప్పాడు. అవ్వ అభిమానం చూరగొనడానికి అక్కడక్కడ ఏడుపును జతచేశాడు! అవ్వ మనస్సు ద్రవించేలా చెయ్యడంలో కృతకృత్యుడై,

"నిన్ను చూస్తుంటే మా తాతయ్యని చూస్తున్నట్లే వుందవ్వా ! నీతోనే వుంటాను...." అన్నాడు ! అవ్వ అంతరంగంలో ఆత్మీయత మొలకెత్తింది ! ఇంత మంచివాడ్ని అనుమానించినందుకు నొచ్చుకుంది !

సినిమా పూర్తయింది మరి !!!

హాలువాళ్ళతో పాటు అవ్వా తన రికార్డును ప్రారంభించింది. క్షుద్బాధ కాస్త శాంతించిందేమో, అవ్వ వేస్తున్న పాత రికార్డు జోరుగాసాగుతోంది ! వచ్చేజనం, పోయేజనం పైసా పరకా వేస్తూండడంతో అవ్వకి నాలుగురూపాయల్దాకా దొరికాయి! ఓ గంట గడిచింది.

"అవ్వా !...."

"ఏం నారాయుడూ ....?"

"ఇంకా ఎంతసేపుంటావు ?"

"మరేల్నాయినా- మారాట మొదలెట్టేసినారు గదా ! బడిశాలకెల్లిపోద సేం! ...."

"ఆకలేస్తన్నాదేటవ్వా ?"

".... ఎస్తంది ...."

"ఏటేన తింటావేటి ?"

"నానాయిన్నా నాయినే....! ఇప్పించు తండ్రీ ....!"


అవ్వని ఓ 'కాకా విలాస్'కి తీసికెళ్ళి రెండు ప్లేట్ల టిఫిన్ తెప్పించాడు. కుడుం ముక్కలు ! చెట్నీని. కారం గుండని మళ్ళా మళ్ళా తెప్పించుకొని జుర్రేసి. నాలుగేసి గ్లాసుల నీళ్ళు తాగి త్రేన్చారు ! డబ్బులు నారాయుడే చెల్లించాడు ! అవ్వ చెబుతున్న ఆనవాళ్ళతో, దార్లో కొందర్ని భోగట్టావేస్తూ బడిశాలకి అవ్వని సురక్షితంగా చేర్చేశాడు. పక్క పక్కనే యిద్దరూ నడుంవాల్చారు !

అవ్వకిప్పుడు ఆనందంగావుంది! జోలి నిండింది. జోలి జోలికి పోనవసరం లేకుండానే కడుపు నిండింది ! పడుకోవడానికా చోటుకు రావడానికి రోజూ యెన్నో బాధలు పడవలసివచ్చేవి. దారి తప్పి పోయేది. దెబ్బలు తగుల్చుకునేది. చెయ్యి పట్టుకొని అక్కడికి చేర్చేవారు దొరక్క నానాపాట్లూ పడేది. తన బాధలకు భగవంతుడు జాలి తలిచి. నారాయుడ్ని తనకు ఊతకర్రగా ప్రసాదించాడని భావించి మొక్కుకుంది. తనకి దొరికిన ఈ ఆసరాని విడిచిపెట్టకూడదని నిశ్చయించుకొంది. అలవాటుగా ఒక చేతిని జోలిమీద వుంచి. రెండోచేత్తో నారాయుడి తలను ఆప్యాయంగా నిముర్తోంది ! నారాయుడూ నిద్రపోలేదు ! ఆ త్మీయతతో అవ్వని బంధించాలని యెప్పుడో నిర్ణయించేసుకున్నాడు. లేచి కూచొని అవ్వకి కాళ్ళు పట్టసాగాడు !

ఓరోజున కేటుగాడెవడో అవ్వ మొల లోని జోలిని ఊడబీక్కొని పారిపోబోతే, నారాయుడు వాడ్నందుకొని. బండబూతులు తిడుతూ చితకబాదేశాడు! గుడ్డిదాని దగ్గర డబ్బుకి భద్రత లేదనిచెప్పి జోలిని నారాయుణ్నే దాచమంది !! అప్పుడు నారాయుడి కళ్ళలో మెరిసిన మెరుపును చూడ్డానికి అవ్వకి కళ్ళులేవు మరి ! !


రోజులు బాగానే గడుస్తున్నాయి గానీ.. నారాయుడికీ మధ్య ఓ గడ్డు సమస్య యెదురౌతోంది. తాతని తిప్పుతున్నప్పుడు తను చిన్నవాడు! కనుక ధర్మం చేస్తున్న వాళ్ళు వాడినీ దయతలచేవారు. కాని యిప్పుడు దుక్కలా వస్తాదులా తయారై యౌవనంలో వున్నాడు ! అవ్వని తిప్పుతుంటే తనని తిడుతున్నారు. కష్టపడి సంపాదించి. ముసల్దాన్ని పోషించమని కసిరికొడ్తున్నారు!

తన డబ్బూ,అవ్వ యిచ్చిందీ కలిపితే ఆరొందలకి పైగానే వుంది. తాత కోరిక తీర్చినట్లూ, తన సమస్య తీరినట్లూ వుంటుందని ఓ టీ కొట్టు పెడదామని పించింది. తనకి బాగా.పరిచయం ఔతున్న 'ఈశు' టీ కొట్టుని పరిశీలించడం ప్రారంభించాడు. ఈశు కుటుంబం అందరూ ఆ



# అదిచాలు!

మధువు వద్దు
నాకు; చెలీ!



నీ చూపులు
ఓ దోసెడు పొయ్యి —
తాగుతాను.

—ఎ. వి. మంగపతిరావు

హోటల్ నడపడంలో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా కడుపు జరక్క యీసురోమంటున్నారు! ఎముకలు విరిగేలా శ్రమపడుతున్నా వెనకేసిందేమీ లేకపోగా పైపెచ్చు అప్పులు వున్నాయని గ్రహించేసాడు. కష్టపడితే కండలు కరిగిపోయి చెమట రాల్డం తప్ప డబ్బులు కూడడం కష్టం అని గ్రహించేశాడు. పెట్టుబడీ, శ్రమా లేని ఈ బతుకే హాయిగా వుందనిపించడంతో వ్యాపారం పెట్టాలన్న ఆలోచననే మట్టుపెట్టేశాడు! అంతే—

గెడ్డం పెంచేశాడు. చెయ్యి విరిగినట్టు కాళ్ళకి పుళ్ళయినట్లు చూసేవాళ్ళు భ్రమించేలా కట్లు కట్టేశాడు. కుంటి నడకలు ప్రారంభించేసి 'తిట్లు కాయకం అన్న గడ్డు సమస్య'ను పరిష్కరించేసుకొని బిచ్చం రాలేలా చేసుకున్నాడు!! డబ్బులు బాగానే దొరుకుతున్నాయి. వెనకేస్తున్నాడు.

ఏ దేవుడికే రోజు గిరాకీ వుంటుందో ఆ గుడి మెట్ల దగ్గరకి తెల్లవారే సరికల్లా అవ్వతో సహా హాజరయ్యేవాడు! జనంతో బజార్లు నిండేసరికి షాపుల దగ్గరికి అవ్వను తీసికెళ్ళి అడుక్కునేవాడు. రిలీజ్ పిక్చర్లు వేసే థియేటరు విడిచిపెట్టేవాడు కాదు. శుభకార్యాలు జరిగే ఇళ్ళు, సంతర్పణలు జరిగే చోట్లూ ఓ కంట కనిపెడుతూ, ఖర్చు లేకుండా కడుపు నిండేలా చూసుకునేవాడు. నాలుగు డబ్బులు ధర్మంగా రాలే ఏ తావులూ తప్పిపోకుండా అవ్వని హైరానా పెడుతూ తిప్పేసేవాడు. వాడి వేగాన్నందుకోలేక అవ్వ ప్రాణాలు అడుగంటిపోతూ వుండేవి! కాని గత్యంతరంలేక అనుసరించేది!

వాడితో సమానంగా తిండి దొరక్కపోయినా తిప్పట తప్పేదికాదు. వాడిచ్చిన టీ నీళ్ళతో ప్రాణాలు నిలుపుకోలేక ఆర్నెల్లు తిరిగేసరికి అవ్వ 'హరీ'మంది! కర్రల్లో తగలేస్తే ఖర్చవుతుందని నలుగురు ముష్టివాళ్ళ తోడుతో అవ్వశవాన్ని పాతేసి చేతులు దులుపుకున్నాడు నారాయుడు!

నారాయుడికి బాధనిపించలేదు! తాత పోయినప్పట్లా దుఃఖంలో మునిగిపోలేదు! అంతరంగంలో అవ్వపట్ల అపేక్ష అనేది అణుమాత్రంకూడా లేనికారణంచేత, దాని మరణం వాడిమీద ఏ ప్రభావమూ చూపలేదు మరి!

నారాయుడు పెరిగాడు, బాగా ఎదిగిపోయాడు! వాడి చేతిలో డబ్బుంది! దాన్ని మించి తను బాగా బతకడానికి కావలసిన బోలెడు ఆలోచనలు వాడి బుర్ర నిండా వున్నాయి!! ఇప్పుడు వాడికా పట్టణం ఇరుకనిపించింది! మరో పెద్ద నగరానికి మకాం యెత్తేశాడు! ఒక వారంపాటు ఆ నగరం అంతా కలియ తిరిగాడు. తక్కువ ఖర్చుతో కడుపునిండే తావులు వెదికాడు!

నారాయుడి దగ్గర ఏడొందలకు పైగానే సొమ్ముంది. క్షుద్బాధలేమి గానీ .... వాడికి "అసంతృప్తి"గా వుంటోంది! ఆరోగ్యంగా యౌవనంలోవున్న నారాయుడికి రాత్రిళ్ళు సరిగా నిద్రపట్టక కోర్కెలు బుసలు కొట్టడంతో వాడికి స్త్రీ సుఖం కావాల్సి వచ్చింది! అది దొరక్క మహా యాతనగా వుంటోంది! అసలీకోర్కె అంకురించడం చిత్రంగా ప్రారంభమయింది! అవ్వతోపాటు బడిశాలలో పడుకున్నాడు. ఓ రాత్రి వేళ తెలివొచ్చింది. తమలాగే ఆ పాకలో తలదాచుకుంటున్న ఎవరో దంపతులు సాగిస్తున్న సృష్టికార్యం వాడి కళ్ళకి లీలగా గోచరించింది! దాంతో వాడికి నరనరాల్లోంచి విద్యుత్తు ప్రవహించినట్లయింది! అక్కడ్నుంచి ఆ వాంఛని అణగదొక్కుకోవడం వాడికి అసాధ్యమయింది!


అదిగో సరిగ్గా అలాంటి సమయంలో పారమ్మ వాడి కంటపడింది.

పారమ్మది అందం పుట్టిపడే ముఖం! నల్లటి నలుపైనా ఎంతో ఆకర్షణ వుందామెలో! యింతలేసి కళ్ళతో, తీరైన ముఖంతో, చూడముచ్చటగా, ఎంతో శుభ్రంగానూ వుంటుంది! చక్కగా ముస్తాబై కడిగిన ముత్యంలా వుంటుంది! పైగా ఆమె తీయనైన గొంతును కలిగి వుంది! గొంతెత్తిపాడితే- ఎంత తొందర పనుల్లో పోతున్నవాళ్ళయినా తక్కున ఆగిపోవాల్సిందే! అంతటి మాధుర్యం వుందామె కంఠంలో!

కాని— ఇంత మధురంగా పాడగల, ఎంతో ఆకర్షణీయమైన రూపంగల పారమ్మ వికలాంగురాలు!!! ఆమెకు బాల్యంలో పోలియో సోకింది! కాళ్ళు రెండూ చీపురుపుల్లల్లా తయారై, కప్పకాళ్ళలా మెలికలు తిరిగిపోయాయి! బాల్యంలో బలహీనతవల్ల కూచున్నచోటు నుంచి కదలలేకపోయేది! బాగా ఒళ్ళుచేసి యౌవనంలో అడుగు పెట్టిందగ్గర్నుంచి— చేతులమీద భారాన్నంతా మోపి దేకుతూ ఇంటిపనీ, వంటపనీ స్వయంగా చేసుకునే స్థితికి ఎదిగింది!

తల్లీ, తండ్రీ కరువైన పారమ్మకు వాళ్ళు మిగిల్చిన కమ్మయిల్లు మిగిలింది. తలదాచుకోడానికా గూడూ, కూడుపెట్టడానికా అంగవైకల్యం ఆమెకు ఉపకరిస్తున్నాయి!

ఏ రిక్షావాలాను బతిమాలో, కాసింత



**అంబడిపూడి**
సెక్సు విజ్ఞాన ప్రచురణలు

ప్రపంచంలో వున్న ఏకైక సెక్స్ లేబరేటరీ నిర్వహించిన డాక్టర్స్ మాస్టర్స్ జాన్సన్ సెక్సాలజీ ఎడిటర్ లెమన్‌క్లార్కు డాక్టర్ రాబర్ట్ చార్ల్‌హం పరిశోధనల ఆధారంగా దంపతులు ఆనందంగా తృప్తిగా జీవించడానికి వివాహ జీవితం విజయవంతమై ఆరోగ్యకర సంతానానికి ప్రతి స్త్రీ పురుషుని దృష్టిలో పెట్టుకొని రూపొందించబడిన పుస్తకాలు. తెలుగులో

1. గుప్తజ్ఞానం. వెల రూ. 10/-
2. 1001 సిగ్గుపడే ప్రశ్నలు. వెల రూ. 10/-
3. సెక్స్ విజ్ఞానం వెల రూ. 10/-
4. గర్భమూ-గర్భనిరోధం 5/-
5. సెక్సులోపాలు-సర్దుబాట్లు. 6/-
6. ఉద్రిక్తస్థానాలు-తృప్తికి మార్గాలు 6/-
7. కేళీ విలాసం 5/-

మిత్రులతో చెప్పుకోలేక డాక్టర్‌తో చెప్పడానికి సిగ్గుపడి లోలోన కుంగిపోతున్న యువతీయువకుల సందేహాలు సమాధానాల రూపంలో సెక్స్ విజ్ఞానం. నిరాశ. నిస్పృహ ఆత్మహత్యలు నివారించి సంతోషంగా జీవించగల మార్గాలు ప్రపంచమన్ని భాషల్లో అనువదింపబడిన పురాతన హిందూ సెక్స్ ప్రామాణిక గ్రంథం. మహర్షి

8. వాత్స్యాయన కామశాస్త్రం 5/-

భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జి.డి. ఖోస్లా పుస్తకం ఇన్స్పిరేషన్‌తో వ్రాయబడింది స్త్రీ మానసిక పరిశోధకురాలు డాక్టర్ సైమన్ డి బోవర్ ఆధారంగా హిందూ శాస్త్రాల ఆధారంగా

9. స్త్రీలనాకర్షించడమెలా 4/-
10. పురుషులనాకర్షించడమెలా 10/-
11. [illegible] కోరేదేమిటి 4/-

రూపాయలు [illegible] ముందుగా [illegible] ద్వారా [illegible] వారికి [illegible]


ముట్టజెప్పి, ఎప్పుడూ సందడిగా వుండే ఓ సెంటర్ కిచేరి మూలగా కూర్చొని అడుక్కుంటూ వుంటుంది! పారమ్మది మంచి జ్ఞాపకశక్తి! ఏ రికార్డువిన్నా వెంటనే ఆ పాటా, బాణీ ఆమెకు పట్టుబడిపోయేవి! సినిమా ఒక్కసారి చూసిందంటే అందులోని సంభాషణలు ఆమెకు కొట్టిన పిండయ్యేవి! శ్రావ్యంగా పాడుతూ, అందమైన కళ్ళను చిత్రంగా తిప్పుతూ, సినిమాల్లోని మాటలు చెప్పి జనాన్ని ఆనందపరుస్తూ అడుక్కునేది! ఆమె గాత్ర మాధుర్యానికి ముచ్చటపడి, ఆమెకు ప్రాప్తించిన అంగవైకల్యానికి జాలిపడి కొందరు దానంచేస్తే, అందమైన ఆమె ముఖాన్నీ, కొంగుచాటున తొంగి చూస్తున్న వయస్సు పొంగుల్నీ చూస్తూ యెందరో డబ్బులు రాల్చేవారు!! పాటలు పాడే పారమ్మచుట్టూ యువకులు లొట్టలేస్తూ నిలబడేవారు! తనచుట్టూ మూగినవాళ్ళకి అతి చవగ్గా వినోదాన్నందిస్తూండేది పారమ్మ.

అలాంటి పారమ్మను, ఆమె తనను గమనించకుండా జాగ్రత్తపడుతూ రెండు మూడు రోజులు నిశితంగానే పరిశీలించాడు నారాయుడు. ఆమె సంపాదనముందు తాతా, అవ్వా తనూ బలాదూరని గ్రహించేశాడు. పాతికేళ్ళ జీవితం పండు ముసలాళ్ళ మధ్య గడిచిపోయినందుకు వాడికి బాధగా వుంది! తన వూహలకు ఈ పారమ్మ ప్రతిరూపంగా వాడికి భాసిల్లింది. అంతే—

రోడ్డు పక్కన గుట్టలుగా పేర్చి అమ్ముతున్న సెకెండ్ హేండ్ బట్టల్లోంచి తనకి సరిగ్గా సరిపడే ఓ జత ఎంచాడు. ఒకటికి నాలుగు పార్లు బేరమాడి అతి చవగ్గా కొనేశాడు. అందంగా కటింగ్ చేయించుకొని, గెడ్డం నున్నగా గీయించేసి, శుభ్రంగా స్నానంచేసి, పేంటూ, బుష్‌కోటూ వేసుకున్నాడు. బాగున్నాయని జనం మెచ్చుకుంటున్న రెండు సినిమాలు చూశాడు. ఆ తరవాతే పారమ్మను సమీపించాడు. మెల్లిగా మాటలు కలిపాడు. తను చూసిన సినిమాలు వాడికిప్పుడు బాగానే ఉపయోగపడ్డాయి. ఆమె తత్వాన్ని బాగా గ్రహించాడేమో- తొందరపడి వ్యవహారం బెడిసికొట్టకుండా చాలా జాగ్రత్తపడ్డాడు. నాలుగు రోజులు గడిపి పరిచయం పెంచుకున్నాడు.

ఓ అసుర సంధ్యవేళ హఠాత్తుగా మేఘాలు కమ్మేశాయి. ముందు గాలి, వెనువెంటనే వానా ఆ ప్రాంతం మీద దాడి ప్రారంభించాయి. పాటలు పాడుతూ బిచ్చం అడుక్కోవడంలో మునిగిన పారమ్మ- ఈ హఠాత్పరిణామాన్ని ముందుగా గమనించలేకపోయింది. ఆత్రంగా ఓ నాలుగడుగులు దేకిరి చుట్టూ కలియచూసింది. రిక్షాలకు గిరాకీ తగిలి ఒక్కటీ అక్కడ కనిపించలేదు. జనం పరుగులు పెడుతున్నారు! మెరుపులు మెరుస్తూ మేఘాలు గర్జిస్తున్నాయి! ఆమె ఆందోళనలాగే వర్షంకూడా ఎక్కువ కాసాగింది!

వర్షాన్ని లెక్కచెయ్యక ఆమెనే చూస్తూ నిలబడ్డాడు నారాయుడు! వాడివేపు నిస్సహాయంగా, జాలిగా చూసింది పారమ్మ. గబగబా పారమ్మని సమీపించి, ఆమెను ఎత్తుకొని భుజాన వేసుకొని, గట్టిగా అదుముకుంటూ బంధించి, పరుగులాంటి నడకతో కొంత దూరం వెళ్ళి, ఓ యింటి పంచలో ఆమెను దించాడు!

ఎదురుగా వున్న వీధి దీపం వెలుతురు ఆ పంచను కాంతిమయం చేస్తోంది! నారాయుడ్ని సూటిగా చూడలేకపోయింది పారమ్మ! తడిసిన బట్టలవల్ల తన ఒంపుసొంపులు బహిర్గతం అవుతుంటే సిగ్గుతో కుంచించుకుపోతోంది. వెలుతురు ఆమెకి యిబ్బందిగా వుంది. తనని భుజానికి ఎత్తి మోసిన నారాయుడు చేతుల్లో బంధింపబడిన దగ్గర్నుంచి, తన పరువం తీయనైన బాధకి లోనయింది. ఆ మధురానుభూతినుంచి ఆమె కోలుకోలేకపోతోంది!

నారాయుడి పనీ అలాగే వుంది గానీ, తమాయించుకున్నాడు! తడిసిన బుష్‌కోట్‌నీ, పేంట్‌నీ యిప్పేసి, నిక్కర్లోంచి నోట్లు తీసి, అవి తడవనందుకు తృప్తిపడ్డాడు!! బట్టల్ని పిడిచి తిరిగి వాటినే వేసుకున్నాడు. డబ్బు మాత్రం చేత్తో పట్టుకున్నాడు. పారమ్మ పరువాన్ని క్రీగంట చూశాడు. బుద్ధిమంతుడిలా తలతిప్పి ఎటో చూస్తున్నట్లు నిలబడ్డాడు.

వర్షం పడుతూనే వుంది. ఓ గంట గడిచింది! ఇద్దరూ మౌనంగానే వున్నారుగాని ఒకర్ని గురించి మరొకరు ఆలోచించుకుంటూనే వున్నారు. వర్షం ఆగలేదు. పారమ్మకిలా మౌనంగా వుండడం దుర్భరం అనిపించింది.

"నాను యింటి కెలాగెల్లడమో....!?" ప్రకాశంగానే అంది.

"నీ యిల్లెక్కడ!"

చెప్పింది.

"పద- ఎత్తుకొని తీసుకుపోతాను...."

"అమ్మ బాబోయ్! అంత దూరం నన్ను మొయ్యగలవేటి?" నవ్వుతూ కవ్వించింది!

"ఇదేపాటి! నిన్నెత్తుకొని సింహాచెలం కొండెక్కిపోగల్ను."

"ఒస్సోస్- మరీ కాయ్యక!" రెచ్చగొట్టిందామె.

"అయితే సూడు మరి!" అమాంతం ఆమెను భుజాని కెత్తుకున్నాడు.

"అమ్మో ఎంత బలంవో! బాబ్బాబు దించి దించీ" గింజుకుందామె.

"ఏం!"

"నాకు సిగ్గేస్తంది బాబూ! దించీసీ. ఎవులేన సూసిగల్రు."

దించేశాడు!

"ఇప్పుడింటికెలాగెల్తావ్?"

"ఎలాగూ యింతరాద్దుండి పోనాను గాదా! మరోగడికో సిటానికో ఏ రిక్సాయేనా రాదా....!?"

నిట్టూర్చి మౌనంగా వుండిపోయాడు! పారమ్మే మళ్ళా కలిపించుకొంది!

"నాసంగతేంగాని,నువ్వెటుకాపెల్లాల?"

తన బతుకుని గురించి-అవ్వని మినహాయించేసి- ఆమె మనస్సు కరిగేలా జాగ్రత్తగా చెప్పాడు!

"అయితే నాలాగే నీకూ ఎవ్వలూ లేరన్నమాట!?" అంది సానుభూతిగా!

"ఎవరున్నారు? ఈ డబ్బుతప్ప.... నాకెవ్వరూ లేరు...." మౌనం రాజ్యం చేసింది మళ్ళా! ఇంతలో దూరంగా రిక్షా వస్తున్న అలికిడికిఅటుచూసింది పారమ్మ. దగ్గరపడ్డంతో రిక్షావాలాని గుర్తించి—

"రాకెట్టూ- ఓర్ రాకెట్టూ- రార తమ్ముడు రారా—" పిలిచింది. రిక్షావాలా ఆమెను చూసి—

"ఓస్ నువ్వా తల్లీ! నానురాను. మైల్దూరం తీసికెల్తే పావలా యిచ్చి బతివాలేస్తావ్?"

"నానాయిన్నాయినా ఓరాత్రికి టిక్కండిపోనాన్రా—"

"నన్నేటి పెయ్యమంటావ్?"

"ఒకే యీడోలంవన్న మొగమాట మేన లేదేట్రా నీకూ? ఇంటికి పేరిసి పున్నెం కట్టుకోవా?"

"నాను పున్నెం కట్టుకుంటే నా వొంతి రిక్షా అద్దెవుడుకట్టుకుంటాడు? అసలేబేరం లేదు. రూపాయిస్తే పెప్పు— లేపోతే లేదు" రిక్షా కదలబోతోంది!

"ఆపు! ఇంద. ఈ రూపాయి తీసుకొని ఆమెను యింటికి సేర్చు" అంటూ తనే రూపాయిచ్చేసి పారమ్మను ఎత్తి రిక్షాలో కూర్చోబెట్టాడు. ఆమె మనస్సు కృతజ్ఞతతో నిండిపోయింది! తనపట్ల యింత అభిమానాన్ని చూపుతున్న నారాయుడ్ని అక్కడే ఒదిలేసిపోవటానికి మనస్కరించక—

"మరి .... మరి నువ్వో .... నువ్వూ ఎలిపోవస్తే...."

"నేనా!? ఈ రాత్రి నీతో వొచ్చి నీ యింటికాడే వుండిపోతే రేపు నువ్వు మీ పేటలో తలెత్తుకోగలవేటి?"

"అ(అ( .... అవును ....కా.... నీ...."

"సూడూ! నా గురించి బాదపడగ్గానీ— నాకో సాయం సెయ్యి...."

"ఏటి సెయ్యమంటావో సెప్పు" ఆత్రం చూపుతోంది!

"బట్టలన్నీ తడిసిపోనాయి. ఈ నోట్లు గాన్నాకాడుంటే నానిపోయి పాడై పోతాయి. ఈ రాత్రికి నీ కాడి డబ్బుంచి రేపుట్టుకురా" అంటూ అందించాడు! అందుకొంది.

"ఎంతిది?"

"అరొందలు."

"అరొంతలే!!!?— ఇంత డబ్బు నా సేతికిచ్చేస్తన్నావ్! ఏట్నె నమ్మకం?"

"నిన్నే నమ్మకపోతే యింక నానెవుల్ని నమ్మగల్ను?" గురిచూసి ప్రయోగించాడు!

నారాయుడికి గుండెలో గుడి కట్టేసింది పారమ్మ!

రిక్షా కదిలింది!!

తన పక్షకంలోని లాభనష్టాల్ని బేరీజు వేసుకొన్నాక— ఇంతసేపూ పారమ్మ కూర్చున్నచోట తృప్తిగా వాడు నిద్రించాడు! కానీ— ఇంటికి చేరిన పారమ్మకి మాత్రం ఎంతో రాత్రివరకూ నిద్రపట్టలేదు! నారాయుడు తనని ఎత్తిపట్టుకున్నప్పుడు కలిగిన 'సుఖాన్ని' తలుచుకుంటూ ఆనందంలో తేలిపోయింది!

# నగరం

ప్రొద్దు వాలితే—
నగర కాంత
విందు చూలింత!



తెల్లవారితే—
పచ్చి బాలింత!

—రెంటాల సత్యనారాయణ

నారాయుడు తనమీద వుంచిన నమ్మకానికి మురిసిపోయింది! ఎప్పటికో నిద్రపట్టి రంగు రంగుల కలలుకంది!

మర్నాడు త్వరగా తెల్లవారింది! బాగా మున్తాబయింది! డబ్బు పట్టుకొని, తను రోజూ కూర్చుండేచోటుకి చేరుకుంది పారమ్మ. నారాయుడుఅక్కడలేడు. గంట, రెండుగంటలు— ఇలా కాలం దొర్లుతోంది గానీ నారాయుడి జాడలేదు! పాట ఆగిపోయింది! అడుక్కోవటం మరిచిపోయింది! మతిపోయినదాన్లా ఆత్రంగా వాడికోసం కలియజూస్తోంది!!

కావాలనే ఆలస్యంచేసి- పదిగంటలు దాటుతూంటే అక్కడికి వచ్చాడు! తననీ చూడ్డంతోటే పారమ్మ కళ్ళు వెలిగిపోవడంచూసి తన అంచనా తప్పనందుకు లోలోన నవ్వుకున్నాడు.

నారాయుడికి డబ్బు యిచ్చెయ్యబోయింది. పారమ్మనే దాచమన్నాడు. మురిసిపోయింది. తన యింటి దగ్గర భద్రత తక్కువనీ- బేంకిలో దాచమనీ సలహా యిచ్చింది. ఎలా దాచాలో తనకి తెలియదన్నాడు. పాన్‌షాపు అప్పారావుని కలిస్తే అన్నీ చెబుతాడంది. వెళ్ళి వివరాలు కనుక్కొచ్చాడు. డబ్బు చేతిలో పెట్టి బేంకికి వెళ్ళమని తొందర పెట్టింది. అలాగే చేసివచ్చి పాస్‌బుక్ చూపాడు. నారాయుడు తనమాట ప్రకారం బుద్ధిగా నడుచుకుంటున్నందుకు పారమ్మకు గర్వంగా వుంది మరి!

మరో నాలుగు రోజులు గడిచేసరికి మరింత సాన్నిహిత్యం పెరిగాక- పారమ్మ యింటికి రాకపోకలు మొదలెట్టాడు నారాయుడు. అంతేకాదు కొళాయినుంచి నీళ్ళు తెచ్చి యివ్వడం. వంట పనుల్లో సహకరించటం ప్రారంభించాడు. నారాయుడి పట్ల ఆమెలో అనురాగం లతలు వేసింది.

ఓ రోజున మామూలుగా నారాయుడు వెళ్ళేసరికి, పారమ్మ కళ్ళు తుడుచుకుంటూ కనిపించింది. కంట తడిపెట్టడానికి కారణం అడిగాడు. చెప్పింది. ఉగ్రుడయాడు. గభాల్న ఆమెను భుజానికెత్తుకున్నాడు. కొళాయి దగ్గర కొచ్చాడు. తనకు 'రంకు' కట్టిన వాళ్ళందర్నీ తిట్టిపోశాడు. తను పారమ్మను పెళ్ళి చేసుకోబోతున్నట్టు 'బోర విరిచి' మరీ ప్రకటించేశాడు! ఆమెను అలాగే మోసుకుంటూ పోయి ఓ గుడికి చేశాడు. పూజార్ని బతిమాలి కాస్త ముస్తై చెప్పి. పసుపుతాడు తీసుకుని పారమ్మ మెడలో కట్టేశాడు. వాడి పాదాలపై పారమ్మ వాలిపోయింది.

పారమ్మను స్వంతం చేసుకున్నాక విజృంభించాడు నారాయుడు: బేంక్‌నించి రెండొందలు విత్‌డ్రా చేసి- పారమ్మ పేర

తీసుకున్న మూడు వందలతో దాన్ని జత చేసి ఒక చక్రాలబండి చేయించాడు! అందులో పారమ్మని కూర్చోపెట్టి బండిని తోసుకుంటూ ఆమెకు బజారంతా చూపించాడు! పార్కులూ, బీచీ చూపించాడు! పారమ్మకి కొత్త ప్రపంచంలో విహరిస్తున్న అనుభూతిని కలిగించాడు!

పారమ్మ కిప్పుడు పరమానందంగా వుంది! ఇలా వూరంతా తిరిగి చూసే భాగ్యం తనకుండేది కాదు! తన బతుకు ఏ తీరున నడుస్తుందో తెలియక బితుకుగా వుండే! ఎవ్వరూ లేని తను అందరికీ లోకువగా వుండవలసివచ్చేది. కాని తన కిప్పుడు కొండంత అండ దొరికింది! వీటన్నిటినీ మించిపోయింది నారాయుడు వల్ల తను రాత్రుళ్ళు పొందుతున్నసుఖం! తనని వూపిరి సలుపుకోనంతగా ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాడు! ఆనందంలో మునిగి తేలుతూ గువ్వ పిట్టలా వొదిగి వాడి గుండెపై తలవాల్చి మేను మరిచేది!

పారమ్మ నారాయుడికి పూర్తిగా లొంగిపోయింది!

పాటలు పాడడం పారమ్మవంతు! బండి నడిపే బాధ్యత నారాయుడిది! బజారులన్నీ తిప్పుతుంటే డబ్బులు దండిగానే దొరుకుతున్నాయి. ఇటు కడుపూ, అటు బేంక్ బేలన్సు నిండుతూ వున్నాయి.

నారాయుడికి యిప్పుడు 'అన్ని విధాలా' బాగానే వుంది.

ఇలా సంతోషంగా కాలం వరిగెడుతుంటే పారమ్మకి నెల తప్పింది! తల్లి కాబోతున్నందుకు గర్వంగా వుండేది. కాని ఆమెకా అనుభూతి ఎంతో కాలం నిలవలేదు. ఆమె ఆరోగ్యం దెబ్బ తినడం ప్రారంభించింది. వైద్యం చేయించమంది. పెద్దాసుపత్రికి తీసికెళ్ళాడు. పెద్ద పెద్ద వాళ్ళను తప్ప తమలాంటి వాళ్ళను పురుగుల్లా చూస్తూ నిర్లక్ష్యం చెయ్యడం జరిగింది. ప్రైవేట్ డాక్టర్లకు చూపమనేది. చూపేవాడు. వాళ్ళు మందులు రాసేవాళ్ళు! తెచ్చి యిచ్చేవాడు. ఫలితం శూన్యంగా వుండేది. కడుపులోని శిశువు పెరుగుతున్నకొద్దీ ఆమె ఆరోగ్యం తరగసాగింది. వెయ్యికి దాటిన బేంక్ నిల్వ నాలుగు వందలకి తగ్గిపోయిందిగాని పారమ్మకి పట్టుకున్న జబ్బు తగ్గలేదు.

డబ్బు నీళ్ళలా ఖర్చయిపోతూ వుండడంతో నారాయుడికి భయం పట్టుకుంది. పారమ్మకి ఏపాటి నిమ్మళంగా వున్నా చక్రాలబండి ఎక్కించి తిప్పి డబ్బులు సంపాదించేవాడు! బేంకి నిలవ మళ్ళా వెయ్యి దాటించాలనే ఆరాటం పట్టుకుంది వాడ్ని! కడుపు నిండడంతో తృప్తి పడక, నాలుగు డబ్బులు వెనకెయ్యందేవాడి కళ్ళకి నిద్రపట్టేది కాదు! ఒక్కో రోజున పారమ్మకు నీరసం ఎక్కువగా వుండి రానని మొరాయించినా బలవంతంగా బండి ఎక్కించేవాడు. బలహీనంగా తయారైన పారమ్మను పాడమని నిర్బంధించేవాడు! నారాయుడికి డబ్బుపిచ్చి పట్టుకుందని గ్రహించిన పారమ్మకి గుండె చెరువయిపోయింది.

ఇప్పుడు పారమ్మ గొంతు నిజంగానే విషాద గీతాల్ని ఒలికిస్తోంది. పారమ్మకి నెలలు నిండి చక్రాలబండి మూలపడ్డంతో నారాయుడికి మెదడంతా ఆందోళనతో నిండిపోయింది!

చీకట్లు ముసురుతున్న సమయంలో ఆమెకు నెప్పులు ప్రారంభమయ్యాయి. పేటకంతా పేరు మోసిన నాటు మంత్రసాని మంగమ్మను తీసుకొచ్చాడు. పారమ్మకా ప్రసవ వేదన నరకయాతనగా పరిణమిస్తోంది! ఆమె పెడుతున్న పెడబొబ్బలికి పేటలోని స్త్రీలంతావచ్చి యింటా బయటా గుమిగూడారు. సానుభూతి, సందేహాలు, సలహాలూ దండిగానే వ్యక్తం కాసాగాయ్!

మూగిన జనం తలోమాటా అంటున్నారు. కాళ్ళులేని పారమ్మకి కాన్పు రావడం కష్టం అని కొందరూ, మంగమ్మ కిటుకులు మరి పని చెయ్యవని కొందరూ, డాక్టర్ను పిలిచి తీరవలసిందేనని అందరూ అంటున్నారు.

నారాయుడికి యిక తప్పిందికాదు. తమ పేటకి ఆరువీధు లవతల వున్న ఓ డాక్టర్ని తీసుకొచ్చాడు. పరీక్షించి, ఇంజక్షనిచ్చి, ఓ పాతిక వసూలు చేశాక, నారాయుడ్ని దూరంగా తీసికెళ్ళి వాడి చెవిలో గుస గుసలాడి డాక్టర్ వెళ్ళిపోయాడు.

ఆ మాటలు వినడంతో అంత చలిలోనూ నారాయుడికి చెమట్లు పట్టేశాయి! బిడ్డ అడ్డం తిరిగిందనీ పారమ్మ రక్తహీనంగా వుందనీ, పెద్దాసుపత్రికి తీసుకెళ్ళి ఓ నాలుగు వందలు ఖర్చు పెడితే రక్తం ఎక్కించి ఆపరేషన్ చేస్తారనీ, బిడ్డ బతికినా మానినా తల్లి ప్రాణం దక్కొచ్చనీ దాని సారాంశం.

పెద్దాసుపత్రి తతంగం నారాయుడికి యిదివరకే తెలుసు. అక్కడి గేట్లూ, తలుపులూ, కిటికీలూ కూడా లంచం అడుగుతాయని వాడికెప్పుడో బోధపడిపోయింది. పురుడు వచ్చినా మానినా— పారమ్మ బతికినా, చచ్చినా- తను యిన్నేళ్ళుగా కూడేసి 'ప్రాణప్రదంగా చూసుకుంటున్న డబ్బు' హరించేసి తన బుర్ర గొరిగి పంపించేస్తారన్న భావం వాడికి బలంగా తట్టేసింది. అంతా బేరీజు వేసుకున్నాడు. అంతే! డాక్టరు చెప్పిన విషయాన్ని తనలోనే తొక్కి పట్టేసి- భారంవంతా నాటు మంత్రసాని మీదే విడిచిపెట్టేశాడు.

తెల్లవారక ముందే పారమ్మ బతుకు తెల్లారిపోయింది! మంగమ్మ శోకాలు పెడుతూ తలుపు తియ్యడంతోనే పేటలోని జనంతో గుడిసె క్రిక్కిరిసిపోయింది! జాలిగుండెగల స్త్రీలు కంట తడిపెడుతున్నారు! కొందరు సానుభూతిగా మాట్లాడసాగారు.

నారాయుడికి అవేవీ వినిపించలేదు. చలనంలేక రాయిలా అలా వుండిపోయాడు! వాడి ముఖంలో ఏ భావమూ వ్యక్తంకావడంలేదు! లోపలికెళ్ళి పారమ్మ శవాన్ని కూడా చూడలేదు! వాడి చూపు యెక్కడో వుంది!

రెండు బారల పొద్దెక్కినా వాడలాగే కూర్చోవడంతో — పేటలోని ముసలాళ్ళు వాడికి కర్తవ్యం బోధించారు! పదిమంది వెంటరాగా పారమ్మ శవాన్ని పాతిపెట్టి, చెరువులో మునిగి వచ్చేశాడు.

ఇప్పుడునారాయుడిలోచలనంవచ్చింది! ఇంటినీ, చక్రాల బండినీ అమ్మేశాడు! బేంకిలో దాచిన డబ్బు తీసేసుకున్నాడు. ఆ నగరాన్ని ఒదిలిపోయాడు!

నారాయుడు వెళ్ళిపోయాడు!

ఎక్కడికి వెళ్ళిపోయాడో!!

భావి జీవితంలో తనకి యింక బాగా ఉపయోగపడే ఊతకర్రని అన్వేషించడానికి బహుశా మరో మహానగరానికి మకాం మార్చేసి వుంటాడు!

అవును; అంతే.

## చచ్చే ఉత్సాహం

రగులుతున్న పొగచుట్టో
రాజుతున్న సిగరెట్టో
ఉంటేచాలు నోట్లో
ఉత్సాహమే మెదడ్లో



ఊపిరి తిత్తుల్లో పొగచేరడం
ఉరః పంజరంలో సెగ రేగడం
దగ్గుతో క్షయతో తల్లడిల్లడం
తరువాయి కాన్సర్‌తో చావడం.

— సుబ్బరామరావు